సిద్ధి వినాయక ఉత్సవాలకు వేళాయే

- 31వ తేదీ నుంచి ప్రారంభం
- జనవరి 4 వరకు కార్యక్రమాలు
- మూడు రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు సిద్ధం చేసిన నిర్వాహకులు

వేడుకలకు సిద్ధమైన రేజింతల్ సిద్ధి వినాయక ఆలయం

సిద్ధి వినాయకుడు

జహీరాబాద్, డిసెంబర్ 28: కొండ కోనలు.. పచ్చని పొలాల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో పుష్యమాసం చవితి రోజున స్వయంభూవుగా వెలిసి, భక్తుల కోరిన కోర్కెలను తీర్చే రేజింతల్ సిద్ధి వినాయకుడి 225వ జయంతి ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 4 వరకు ఆలయంలో జయంతోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రసిద్ధి గాంచిన వినాయక ఆలయాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలోని కాణిపాకం కాగా, రెండవది రేజింతల్ శివారులో వెలిసిన సిద్ధివినాయక ఆలయం. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే స్వామి జయంతోత్సవాలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తారు. ఆలయంలో నాలుగు రోజులపాటు జరిగే జయంతోత్సవాలకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ, హద్నూర్ పోలీసుల ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు.

జయంతోత్సవ కార్యక్రమాల వివరాలు

ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఈ నెల 31వ తేదీన ఉదయం 10 గంటల నుంచి వేద ఘోషం, దీప ప్రజ్వలన, ధ్వజారోహణం, స్వస్తి పుణ్యాహవచనం, స్వామి వారికి అభిషేకం, లక్ష పుష్పార్చన, దేవతా ఆహ్వానం, హారతి, తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయి. జనవరి 1, 2 తేదీల్లో ఆలయంలో ఉదయం 9గంటలకు స్వామివారికి అభిషేకం, గణపతి హవనం, శతచండీహవనం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, 3న స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, 221 అవర్తన గణపతి అధర్వశీర్ష పురస్వర విశేష ఫలవంచామృత అభిషేకం, మధ్యాహ్నం 2.21 గంటలకు యజ్ఞహోమ సమాప్తి, పూర్ణాహుతి, మహా మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరుగుతాయి. 4వ తేదీన ఉదయం స్వామివారికి అభిషేకం, 9 గంటలకు సిద్ధిబుద్ధి సమేత స్వామివారి కల్యాణోత్సవం, 12 గంటలకు మహా మంగళ హారతి కార్యక్రమాలు ఉంటాయి. జనవరి 1, 2, 3 తేదీల్లో ఆలయ ప్రాంగణంలోని యజ్ఞశాలలో జరిగే యజ్ఞల్లో పాల్గొనే భక్తుల కోసం 54 గణపతి హవనం, ఒక శతచండీ హవన యజ్ఞ గుండలను సిద్ధం చేశారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

ఆలయంలో నాలుగు రోజుల పాటు జరిగే రేజింతల్ శ్రీసిద్ధివినాయక స్వామి వారి జయంతోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవతం చేయాలని ఆలయ ట్రస్టు అధ్యక్షుడు రేజింతల్ అశోక్, ప్రధాన కార్యదర్శి అల్లాడి నర్సింలు కోరారు. స్వామి వారి జయంతోత్సవాల కోసం ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల దర్శనం కోసం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. భక్తులకు అన్నదానం, తాగునీరు, వసతి సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కల్హేర్: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు పరామర్శ

కల్హేర్, డిసెంబర్ 28: మండల పరిధిలోని ఖానాపూర్ కే గ్రామానికి చెందిన మూడ్ విఠ్యనాయక్, సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ గ్రామానికి చెందిన రాసాలం సోఫాన్ మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం పొమ్యానాయక్ తండాకు చెందిన మోతిబాయికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.18 వేల చెక్కును అంద జేశారు. ఆయనవెంట మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, సిర్గాపూర్ మండల మాజీ ఎంపీపీ మైపాల్ రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవరావు, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు బషీర్, నాయకులు అంజయ్యసాగర్, ప్రభు, ప్రశాంత్‌సాగర్, బిక్యానాయక్, రామ్లానాయక్, పవార్‌సింగ్, హర్యానాయక్, చందర్‌నాయక్, రాజా, లచ్చానాయక్, రమేశ్, తుకారం, శంకర్, మారుతిపటేల్, అమృతరావు, తులసీరామ్, ధనరాజ్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్, డిసెంబర్ 28: నారాయణఖేడ్‌కు చెందిన కుమ్మరి పండరికి మంజూరైన రూ.60 వేలు, నారాయణఖేడ్ మండలం నాగాపూర్‌కు చెందిన పూల్‌సింగ్‌కు మంజూరైన రూ.22 వేల సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స పొందిన వారిని ఆదుకునే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల సహకారంతో సీఎం సహాయనిధి చెక్కులను మంజూరు చేయించి అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌నాయక్, ఎంఏ నజీబ్, పరశురామ్, నగేశ్, అంజాగౌడ్, వెంకటేశం, సంజీవ్‌కుమార్, శాంతాబాయి, విజయ్, బాన్సువాడ నియోజకవర్గ నాయకులు జుబేర్, అఫ్రోజ్, గణేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి

మరమ్మతు పనులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

బొల్లారం డిసెంబర్ 28: జిన్నారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శనివారం తనిఖీ చేశారు. వసతి గృహంలోని కిటికీలు, తలుపుల మరమ్మతులు జరుగుతున్న విషయం తెలుసుకున్న విద్యాధికారి పాఠశాలను సందర్శించి పనులను పరిశీలించారు. ఓ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్మాణ, మరమ్మతులు జరుగుతున్నాయి. అనంతరం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాలు కొనసాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మంచి ఫలితాలు సాధించేలా పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. వసతి గృహ విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మళ్లీ 15 రోజుల తర్వాత పాఠశాలను సందర్శిస్తానన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఇన్‌చార్జి ఎఫ్ఏఓ వెంకటేశం, మండల ఇన్‌చార్జి విద్యాధికారి కుమారస్వామి, ఎస్ఓ కవిత, ఎన్జీవో సంస్థ ప్రతినిధి సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ల తయారీలో శిక్షణ

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 28: భవిష్యత్‌లో సెమీ కండక్టర్ల పాత్ర కీలకం కానున్నదని సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ సహకారంతో ఆన్‌లైన్‌లోనే ఉచిత శిక్షణ అందించనున్నట్టు వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెమీ కండక్టర్ల చిప్‌ల తయారీపై ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తామని వెల్లడించారు. శిక్షణ కోసం ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్, ఐటీ, సాఫ్ట్‌వేర్ తత్సమాన సాంకేతిక కోర్సుల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన వారు, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, యూజీ, పీజీ విద్యార్థులు అర్హులని వివరించారు. ఎన్ఎస్‌డీసీ ద్వారా సర్టిఫికెట్ అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు కేంద్ర ప్రభుత్వం ద్వారా 100 శాతం సహకారం అందిస్తున్న ఈ శిక్షణలో చేరి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. http://www.skillindiadigital.gov.in/scheme/detail/211లో ఈ నెల 31లోగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా తారా కళాశాలలోని అన్ని యూజీ, పీజీ కోర్సుల గణిత, భౌతిక, కంప్యూటర్ విద్యార్థులు విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

మాట్లాడుతున్న జహీరాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అంజమ్మ

జహీరాబాద్, డిసెంబర్ 28: జహీరాబాద్ పట్టణంలోని ఆర్ఎల్ఆర్ పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్ల తరంగిణి మేళా విజయవంతమైంది. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల ఆవరణలో జహీరాబాద్ ఐసీడీఎస్, అజీమ్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో తరంగిణి మేళాలో అంగన్‌వాడీ టీచర్లు అనుభవాలు పంచుకున్నారు. నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు అధికారులు శిక్షణ ఇచ్చారు. జహీరాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అంజమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చక్కగా బోధించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 28: ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల పరిస్థితులు, సీనియర్ సిటిజన్ సమస్యల వంటి పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ, పోలీసు అధికారులు సివిల్ రైట్స్ డే రోజున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలని ఆదేశించారు. మహనీయుల విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సంక్షేమ శాఖ డీడీ అఖిలేశ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 28: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వారితో సమగ్రంగా చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రతి నెలా మొదటి శనివారం ప్రత్యేక ప్రజావాణి నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సదరన్ సమస్యలపై అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య, గ్రామీణ అభివృద్ధి, దివ్యాంగుల సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. శని, సోమ వారాల్లో నిర్వహించే ప్రజావాణికి వచ్చే దివ్యాంగుల కోసం వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని, బ్యాటరీ ఆటో ట్రాలీని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీడబ్ల్యూవో లలితాకుమారి, డీఆర్డీవో జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌తో ఆలయ కమిటీ సభ్యులు

ఆలయ నిర్మాణానికి నేతల విరాళాలు

బొల్లారం డిసెంబర్ 28: జిన్నారం మండల కేంద్రంలో నిర్మించతలపెట్టిన పోచమ్మ ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇవ్వడానికి పలువురు ముందుకు వస్తున్నారు. శనివారం పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ రూ.లక్ష, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి ఒకటిన్నర టన్నుల స్టీలు, ఐలాపూర్ వాసి మాణిక్‌యాదవ్ 150 బస్తాల సిమెంటును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న నాయకులను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ రాష్ట్ర యువత నాయకులు వెంకటేశంగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, రాము, లింగం, మల్లేశ్, వెంకటేశ్, భూములు పాల్గొన్నారు.

రోడ్ల పనులు నాణ్యతగా చేపట్టాలి

సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్ రెడ్డి

బొల్లారం, డిసెంబర్ 28: సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ చేపట్టాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం 9వ వార్డు కేబీఆర్ కాలనీలో ఆమె పర్యటించి నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల్లో లోపాలు కనిపించొద్దన్నారు. పనులను సకాలంలో పూర్తిచేసే అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం కాలనీ మహిళలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

గండి చెరువును పరిశీలించిన అధికారులు

బొల్లారం, డిసెంబర్ 28: జిన్నారం మండలం కాజిపల్లి రైతుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న గండి చెరువు ఎఫ్‌టీఎస్ సమస్యను నీటి పారుదల, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శనివారం పరిశీలించారు. అనంతరం నీటిపారుదల శాఖ డిప్యూటీ ఈఈ రామస్వామి, ఏఈ ప్రసాద్ సమక్షంలో పీసీబీ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ రవీందర్ నీటి నమూనాలను సేకరించారు. అనంతరం గ్రామానికి చెందిన ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్, నాయకులు నవీన్‌కుమార్ రైతులతో కలిసి అధికారులకు తమ సమస్యను విన్నవిస్తూ ఆందోళన చేపట్టారు. గండిచెరువు ఎఫ్‌టీఎల్ సామర్థ్యాన్ని తగ్గించి రెవెన్యూ రికార్డుల నుంచి తొలిగించాలని విజ్ఞప్తి చేశారు. విచారణ అనంతరం సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు సయ్యద్ రౌఫ్, కొండరాజు, జేఏసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఛాలెంజ్ టెస్ట్‌లో మెరిసిన విద్యార్థి ఆరవ్

రామచంద్రాపురం, డిసెంబర్ 28: ఆర్యభట్ట గణిత ఛాలెంజ్ టెస్ట్‌లో తెల్లాపూర్ మంథన్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి ఆరవ్ సత్తా చాటారు. జాతీయ స్థాయి పోటీల్లో మొదటి, రెండు దశలను విజయవంతంగా పూర్తిచేసి ప్రతిష్ఠాత్మక మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. సీబీఎస్ఈ 18 రీజియన్స్ నుంచి 100మంది విద్యార్థులు ఈ మెరిట్ సర్టిఫికెట్‌ను అందుకున్నారని స్కూల్ మేనేజ్‌మెంట్ తెలిపింది. తమ స్కూల్ విద్యార్థి ఆరవ్ జాతీయ స్థాయి ఆర్యభట్ట గణిత ఛాలెంజ్ 2024లో ఆరవ్ సత్తా చాటి మెరిట్ సర్టిఫికెట్ పొందడం సంతోషంగా ఉన్నదని ప్రిన్సిపాల్ సుర్జీత్‌సింగ్ తెలిపారు. విద్యార్థి ఆరవ్‌ని స్కూల్ మేనేజ్‌మెంట్, టీచర్లు అభినందించారు.

ఉపాధి హామీలో అవకతవకలు

నాగల్‌గిద్ద, డిసెంబర్ 28: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి కుమ్మక్కై అవకతవకలకు పాల్పడ్డట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. శనివారం మండల కేంద్రంలో 31 గ్రామ పంచాయతీలకు సంబంధించి జరిగిన 4,75,99,129 పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. గ్రామాల వారిగా సోషల్ ఆడిట్ వివరాలు చదివి వినిపించారు. ఎస్గీ గ్రామంలో పని చేయని వారికి డబ్బులు జమ అయ్యాయని తేలింది. ముక్తాపూర్, దామర్‌గిద్ద గ్రామాల్లో ఎంపీడీవో సంతకం లేకుండానే నిధులు డ్రా చేశారని, విద్యుత్, మిషన్ భగీరథలో విధులు నిర్వహిస్తున్న వారికి హైదరాబాద్‌లో ఉంటున్న వారి పేరుతో మాస్టర్‌లో నమోదు చేసి డబ్బులు కాజేసినట్లు అధికారులు తెలిపారు. ముక్తాపూర్ గ్రామంలో పంచాయితీ కార్యదర్శి కూలీలపై బెదిరింపులు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించారు. సమాచారం లేకుండా ప్రజా వేదిక నిర్వహించడంతో వెలవెలబోయిందని పలువురు ఆరోపించారు. కార్యక్రమంలో అడిషనల్ పీవో బాల్‌రాజ్, ఏపీవో రాజు, ఏవీవో నాగేశ్వర్ రావ్, క్వాలిటీ కంట్రోలర్ సుభాష్, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఎంపీడీవో మహేశ్వర్ రావ్, ఏపీవో మురళి ఉన్నారు.

రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు సిద్ధం

కలెక్టర్ వల్లూరు క్రాంతికి ధన్యవాదాలు తెలుపుతున్న వీఆర్వోలు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 28: రెవెన్యూ శాఖలో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వీఆర్వోలు స్పష్టం చేశారు. వీఆర్వోల అభిప్రాయ సేకరణలో భాగంగా శనివారం కలెక్టర్ వల్లూరు క్రాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి అధికారులను నియమించినందుకు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూగుల్ షీట్‌లో తమ అభిప్రాయాలను తెలియజేశామన్నారు. రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ వీఆర్వోలు సత్యనారాయణ, సంతోష్‌కుమార్, శ్యామ్, శివరాములు, చంద్రశేఖర్, వెంకటయ్య, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

'తారా'లో ఘనంగా వీరబాల దివస్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 28: ఎందరో అమరవీరులకు భారతదేశం జన్మనిచ్చిందని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో వీరబాల దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీర బాలల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ 1705లో ఔరంగజేబు సేనాధిపతి, సిరిహింద్ నవాబు వజీర్‌ఖాన్ గురుగోవింద్ సింగ్ కుమారులైన ఆరేళ్ల ఫతే సింగ్, ఎనిమిదేళ్ల జూరావర్ సింగ్‌లను మహమ్మదీయ మతంలోకి మారాలని కోరగా, అందుకు నిరాకరించిన ఇద్దరు బాలలను సజీవంగా గోడలో పాతిపెట్టారన్నారు. అంతటి చిన్నతనంలోనే ఆ చిన్నారులు దేశభక్తిని కలిగి ఉండడం అభినందనీయమని, అలాంటి మహనీయుల ఆదర్శాలను పాటిస్తూ బావితరాలకు అందించాలన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాల్సిన అవసరం ఉన్నదన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సదయ్యకుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ సుమతిదేవి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లిక, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కృష్ణ

కృష్ణను సన్మానిస్తున్న సంఘం నాయకులు

చౌటకూర్, డిసెంబరు 28: తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ సర్వీసెస్(ట్రెసా) అందోలు–జోగిపేట డివిజన్ అధ్యక్షుడిగా కె.కష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రం చౌటకూర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో పుల్కల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జి.నారాయణ, ఉపాధ్యక్షులుగా మల్లం రాజు, ఎం.మహిపాల్, పి.మహేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మన్నె మల్లేశం ఎన్నికయ్యారు. వీరితోపాటు సంయుక్త కార్యదర్శులుగా సయ్యద్ దావూద్, జి.వంశీకృష్ణ, ఎన్.ఈశ్వర్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి సీహెచ్. నవీన, కోశాధికారిగా బి.లక్ష్మణ్, కార్యనిర్వాహక సభ్యులుగా బి.భద్రయ్యతోపాటు మరో 25 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఎండీ అష్రఫ్, ఎం.మాధవితోపాటు మరో 25 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు అధికారిగా అందోలు–జోగిపేట డివిజన్ అధ్యక్షుడు, రిటైర్డు తహసీల్దారు ఎం.కిష్టయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో ట్రెసా జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాములు, మన్నె కిరణ్‌కుమార్, గంగాధర్, దశరత్, బాలరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

ట్రెసా 'ఖేడ్' డివిజన్ అధ్యక్షుడిగా ఈశ్వర్



నూతనంగా ఎన్నికైన ట్రెసా కమిటీ సభ్యులు

నారాయణఖేడ్, డిసెంబర్ 28: నారాయణఖేడ్ డివిజన్ తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాములు ఆదేశాల మేరకు శనివారం నారాయణఖేడ్ డివిజన్ కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి పండరీనాథ్ పర్యవేక్షణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నారాయణఖేడ్ ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బి.ఈశ్వర్ అధ్యక్షుడిగా ఎన్నికవగా, ప్రధాన కార్యదర్శిగా డిప్యూటీ తహసీల్దార్ రాజు పటేల్, అసోసియేట్ అధ్యక్షుడిగా అబ్దుల్ మోగ్ని, కోశాధికారిగా మాధవరెడ్డి, ఉపాధ్యక్షులుగా తాజుద్దీన్, హన్మంత్‌రెడ్డి, రామలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా శంకర్‌రెడ్డి, మల్లేశం, కిషన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా జాన్సన్, కార్యవర్గ సభ్యులుగా మదన్‌మోహన్, సుధాకర్, ఖాజా మైనోద్దీన్, రాజు డీసీ సభ్యులుగా రమేశ్, హన్మంతు, సాయిలు, రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాల్వలు మూసిన వారిపై చర్యలు తీసుకోవాలి

అందోల్, డిసెంబర్ 28: అందోల్–జోగిపేట మున్సిపల్ పరిధిలోని కొత్త చెరువు తూము కాల్వలు మూసివేసి వాటిపై వెంచర్లు వేస్తున్నారని, దీనిపై స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జోగిపేటకు చెందిన రాములు మరికొంత మంది రైతులు శనివారం ఇరిగేషన్ ఎస్సీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువు తూము కాల్వను మూసివేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. వెంటనే స్పందించి రైతులు నష్టపోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

జనవరి 7న సదరం శిబిరం

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 28: దివ్యాంగుల గుర్తింపు కోసం నిర్వహించే సదరం శిబిరాన్ని జనవరి 7న మంగళవారం జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి శనివారం ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్లాట్స్ పునరుద్ధరణ కోసం ఈ నెల 31న స్లాట్స్ కేటాయిస్తామని పేర్కొన్నారు. కొత్తగా స్లాట్స్ బుక్ చేసుకునే వారికి నిరంతరం స్లాట్స్ బుక్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మీ సేవా ద్వారా స్లాట్స్ బుక్ చేసుకొని సదరం శిబిరానికి హాజరు కావాలని సూచించారు. సదరం స్లాట్ బుకింగ్ రసీదు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, సంబంధిత మెడికల్ సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలన్నారు. వైకల్యాన్ని బట్టి స్లాట్ నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.

నారింజ వాగు ప్రాజెక్టులో దూకి వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్, డిసెంబర్ 28: జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) సమీపంలోని నారింజ వాగు ప్రాజెక్టులో ఓ వ్యక్తి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని రాచన్నపేట్ కాలనీకి చెందిన కొలి శివకుమార్(45) టైలర్‌గా విక్టర్ టైలర్ షాపులో పనిచేస్తున్నాడు. రోజూ ఇంటికి వెళ్లేటప్పుడు మద్యం తాగి ఇంట్లో గొడవ పడుతుంటారు. ఈ విషయంలో కుటుంబ సభ్యులు మందలించడంతో మానసిక ఆందోళనకు గురైన శివకుమార్ శుక్రవారం ఇంటి నుంచి బైక్ బయటకు వెళ్లాడు. నారింజ వాగు ప్రాజెక్టు సమీపంలోని చెట్లపొదల్లో బైక్ పెట్టి పక్కనే ఉన్న వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం వాగులో మృతదేహం లభ్యం కావడంతో పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుమారుడు రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ ప్రసాద్‌రావు పేర్కొన్నారు.

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

అందోల్, డిసెంబర్ 28: మండల పరిధిలోని మాసాన్‌పల్లి శివారులోని అందోల్ చెరువులో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదహం లభించిందని జోగిపేట ఎస్సై పాండు తెలిపారు. మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ దవాఖానలోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతదేహం సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన శంకరి శ్రీకాంత్‌రెడ్డిది గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం



వద్దొల రమేశ్ (ఫైల్)

జహీరాబాద్, డిసెంబర్ 28: మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమైనట్టు చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వద్దొల రమేశ్(23) మతిస్థిమితం సరిగా లేదు. ఈ నెల 13న ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం యువకుడి తండ్రి ఎల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని కోరారు.